క్లుప్తంగా

దుర్గమ్మ సన్నిధిలో సరస్వతి హోమం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఆదివారం సరస్వతి హోమం చేశారు. ఆలయ వైదిక కమిటీ పర్యవేక్షణలో జరిగిన హోమంలో ఆలయ అధికారులతో పాటు పలువురు విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు. హోమం అనంతరం ఆలయ అర్చకులు పూర్ణాహుతి చేశారు. ప్రతి నెలా మూలా నక్షత్రం రోజు సరస్వతి హోమాన్ని నిర్వహించడంతో పాటు విద్యార్థులకు కంకణాలను అందజేస్తున్నామని అర్చకులు పేర్కొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): విద్యాబుద్ధులు నేర్పి తమ ఉన్నతికి బాటలు వేసిన ఉపాధ్యాయులను విద్యార్థులు సత్కరించుకున్నారు. కేదారేశ్వరపేట ఫ్యూచర్‌పాత్ స్కూల్లో ఓపెన్ ఇంటర్ విద్యను అభ్యసించి తరగతులు ముగిసిన సందర్భంగా చదువు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ 10వ తరగతితో చదువులు నిలిపివేసి కొన్నేళ్లు గడిచినా పై చదువులు లేవనే బాధ తొలగిపోయిందన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 13, 14 తేదీల్లో ఏపీసీసీబీఈఏ డైమండ్ జూబ్లీ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీ కో–ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్(ఏపీసీసీబీఈఏ) 59 వసంతాలు పూర్తి చేసుకుని 60 వసంతంలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో ఏప్రిల్ 13, 14 తేదీలలో విజయవాడ నగరంలో డైమండ్ జూబ్లీ సమావేశాలు నిర్వహించాలని అసోసియేషన్ నిర్ణయించింది. ఆదివారం గవర్నర్‌పేటలోని సంఘ కార్యాలయంలో అసోసియేషన్ ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. ఆల్ ఇండియా బ్యాంక్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో డైమండ్ జూబ్లీ సమావేశాల నిర్వహణపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ సహకార వ్యవస్థలో గణనీయమైన మార్పులు రావడంలో ఏపీసీసీబీఈఏ కీలక పాత్ర పోషించిందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ అసోసియేషన్ డైమండ్ జూబ్లీ జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. డైమండ్ జూబ్లీ సమావేశాలకు సంబంధించి రిసెప్షన్ కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ చైర్మన్‌గా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ , అధ్యక్షులుగా ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి బి.ఎస్. రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా కేవీఎస్ రవికుమార్‌ను నియమించారు.

మీకు ఇచ్చిన పరిధిలోనే స్టాల్స్ ఏర్పాటు చేసుకోవాలి

నిర్వాహకులతో వెస్ట్ ఏసీపీ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కార్పొరేషన్ మీకు కేటాయించిన ప్రాంతంలోనే స్టాల్స్ ఏర్పాటు చేసుకోండి, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని వెస్ట్ ఏసీపీ ఎన్వీఎస్కే దుర్గారావు హెచ్చరించారు. రంజాన్ పురస్కరించుకుని పంజా సెంటర్, వించిపేట గాంధీబొమ్మ, మసీదు ప్రాంతాల్లో ఏర్పాటు చేసే స్టాల్స్ యజమానులతో ఆదివారం కొత్తపేట పోలీసులు సమావేశం ఏర్పాటు చేశారు. కేటీరోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి విచ్చేసిన స్టాల్స్ నిర్వాహకులకు పోలీసులు పలు సూచనలు చేశారు. స్టాల్స్‌ను నిర్ణీత సమయానికి మూసివేయాలని, ప్రజల ప్రశాంత, సాధారణ జీవనానికి ఇబ్బంది కలిగించవద్దని సూచిస్తున్నామన్నారు. సమావేశంలో కొత్తపేట సీఐ కొండలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రహరీ కూల్చిన వ్యక్తిపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రైవేటు స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి ప్రహరీ కూల్చివేసిన ఘటనపై భవానీపురం పీఎస్‌లో కేసు నమోదైంది. విద్యాధరపురానికి చెందిన కొత్తమాసు సత్యవతికి గొల్లపూడి అయ్యప్ప స్వామి గుడి వెనుక 233 చ.గజాల స్థలం ఉంది. ఆ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు చిగురుపాటి వెంకటేశ్వరరావు ప్రయత్నిస్తున్నాడు. ఈ విషయమై స్థల యజమాని గ్రామంలోని పెద్దల వద్ద పంచాయితీ పెట్టాడు. పెద్దలు ఆ స్థలంలోకి వెళ్లవద్దంటూ వెంకటేశ్వరరావును మందలించారు. మళ్లీ శుక్రవారం మధ్యాహ్నం వెంకటేశ్వరరావు స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి ప్రహరీ గోడను కూల్చివేశారు. దీనిపై సత్యవతి భర్త కొత్తమాసు వెంకట రమణయ్య ఫిర్యాదు చేశాడు.

పవిత్రం.. ఆధ్యాత్మిక వైభవం

- భక్తుల కొంగుబంగారం ముక్కంటి
- మహాశివరాత్రికి ముస్తాబైన శివాలయాలు



ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి శివాలయం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): చారిత్రక నేపథ్యం.. పౌరాణిక ఇతిహాసాలతో ముడిపడి ఉన్న 'పశ్చిమ' పాతబస్తీలోని పరమ పవిత్రమైన శైవక్షేత్రాలు ఆధ్యాత్మిక వైభవాన్ని చాటుతున్నాయి. ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు ఈశాన్య దిక్కున పరమేశ్వరుడు.. మల్లేశ్వరస్వామిగా దర్శనమిస్తున్నారు. దక్షిణ దిక్కున విజయేశ్వరస్వామిగా భక్తుల కోర్కెలను తీరుస్తున్నారు. కొండ దిగువన భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామిగా (పాతశివాలయం) భక్తుల మనోభీష్టాలను నేరవేరుస్తున్నారు. విశిష్ట ప్రాశస్త్యాలతో భక్తులను అలరిస్తున్న ఆయా శైవాలయాల విశిష్టతను తెలుసుకుందాం.

మల్లేశ్వరస్వామి ఆలయం (దుర్గగుడి)



పాతశివాలయం రాజగోపురం


ఇంద్రకీలాద్రిపై బ్రహ్మాది దేవతల అభీష్టం మేరకు ఆదిపరాశక్తి మహిషాసురమర్దని స్వరూపంతో అవతరించింది. ఆ పర్వతంపైనే ఈశ్వరుడిరి కూడా కొలువుండేలా చేయాలని భావించిన బ్రహ్మ అత్యంత భక్తిప్రపక్తులతో శతాశ్వమేథ యాగాల్ని చేశాడు. సంతసించిన పరమేశ్వరుడు జ్యోతిర్లింగ స్వరూపంతో బ్రహ్మదేవునికి దర్శనమిచ్చినట్లు స్కాంద పురాణంలో చెప్పబడినట్లు పండితులు చెబుతారు. ఇక్కడ పరమేశ్వరుణ్ణి బ్రహ్మ మల్లికదంబ పుష్పాలతో అర్చించాడు కాబట్టి ఆ స్వామికి మల్లేశ్వరుడు అనే పేరు వచ్చింది. కాలక్రమంలో కలి ప్రభావం వలన ఈ జ్యోతిర్లింగం అదృశ్యంగా ఉండటాన్ని చూసిన శ్రీ శంకరాచార్యులవారు కనకదుర్గాదేవికి ఉత్తర భాగంలో మల్లేశ్వర లింగాన్ని పునఃప్రతిష్ట చేశారు. ఆనాటి నుంచి ఇక్కడ స్వామి వారు విశేష పూజలందుకుంటున్నారు. అయితే మల్లేశ్వరస్వామికి దక్షిణ దిక్కున కనకదుర్గమ్మ కొలువుండటంతో ఇది శక్తి ప్రధానమైన క్షేత్రంగా వెలుగొందుతోంది. మహాశివరాత్రిని పురస్కరించుకొని మల్లేశ్వరస్వామి వారికి కల్యాణ బ్రహ్మోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు.

శ్రీ దర్పేశ్వరస్వామి ఆలయం

కొత్తపేటలో మరో ప్రముఖ శివాలయం శ్రీ దర్పేశ్వరస్వామి ఆలయం. ఈ ఆలయాన్ని రాంపిళ్ల సూర్యనారాయణ నిర్మించారు. కొత్తపేటలో అత్యధిక శాతం ప్రజలు పాతశివాలయం తరువాత ఈ ఆలయంలో స్వామి వారిని దర్శించి పూజలు నిర్వహిస్తుంటారు.

విజయేశ్వరస్వామి ఆలయం

దుర్గగుడి దిగువన పాత అశోక్ పిల్లర్ సమీపంలో రోడ్డును అనుకొని ఉన్న ఆలయమే విజయేశ్వరస్వామి ఆలయం. ఈ ఆలయంలో స్వామివారిని పాండవ మధ్యముడైన అర్జునుడు ప్రతిష్టించాడని ప్రతీతి. అలాగే ఇక్కడ అర్జునుడు, ఈశ్వరుడికి జరిగిన యుద్ధం అనంతరం అర్జునుడికి పాశుపతాస్త్రాన్ని బహూకరించాడు. అర్జునుడు పరమేశ్వరుడిని స్తుతించి ఇంద్రకీలాద్రిపైనే దక్షిణ భాగాన ఒక శివలింగాన్ని ప్రతిష్టించాడు. కాలక్రమంలో ఈ ఆలయం విజయేశ్వరస్వామి ఆలయంగా ప్రసిద్ధికెక్కింది.



కనకదుర్గనగర్ వద్ద విజయేశ్వరస్వామి ఆలయం

పాతశివాలయం

పాండవ అగ్రజుడు ధర్మరాజు ప్రతిష్టించిన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం నిత్యం భక్తులతో కిటకిటలాడుతూ ఉంటుంది. పాతశివాలయంగా పిలిచే ఈ ఆలయానికి పౌరాణికగాథలు ఉన్నట్లు పండితులు చెబుతున్నారు. ఈ ఆలయం పూర్వం సాలుసహస్రస్తంభ దేవాలయంగా అంటే వేయిస్తంభాలతో విస్తరించి ఉండేదని చరిత్ర చెబుతోంది. పశ్చిమ చాళుక్య రాజైన త్రిభువనమల్లుడు క్రీ.శ పదో శతాబ్దంలో తన పేరుమీదుగా త్రిభువన మల్లేశ్వరాలయాన్ని నిర్మాణం చేశారని చెబుతుంటారు. విజయవాడ పౌరాణిక, చారిత్రిక అంశాలను వివరించే పలు శాసనాలు కూడా ఈ ఆలయంలో భద్రపరిచారు. ఇక్కడ శివరాత్రికి పాంచాహ్నిక కల్యాణ రథ, పుష్ప, యాగోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ అధికారులు తెలిపారు.

ఘనంగా విష్ణు కుమార్తె వివాహ వేడుక



నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, జోగి రమేష్ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్, కిరణ్మయి దంపతుల కుమార్తె లక్ష్మీ చంద్రిక, వేంకట సుబ్రహ్మణ్యసాయికిరణ్‌ల వివాహ వేడుక ఆదివారం ఘనంగా జరిగింది. లబ్బీపేటలోని ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ వేడుకకు పలువురు ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివాహ వేడుకకు హాజరైన వారిలో రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, కేశినేని నాని, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురామ్, ఎండీ రుహుల్లా, పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, మాజీ మంత్రులు పేర్ని నాని, అంబటి రాంబాబు, జోగి రమేష్, మాజీ ఎమ్మెల్యేలు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, స్వామిదాసు, మొండితోక జగన్‌మోహనరావు, విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శ్రీశైలజారెడ్డి తదితరులు ఉన్నారు.

చంద్రబాబు నిరుద్యోగులను నట్టేట ముంచారు

పోతిన మహేష్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నిరుద్యోగులను, ఉద్యోగులనే కాదు అన్నివర్గాల ప్రజలనూ మోసం చేయడమే అలవాటుగా మార్చుకున్న చంద్రబాబు గ్రూప్–2 అభ్యర్థులను సైతం నట్టేట ముంచారని వైఎస్సార్ సీపీ నేత పోతిన మహేష్ విమర్శించారు. ఆయన విజయవాడలో ఆదివారం మాట్లాడారు. మూడు వారాలుగా గ్రూప్–2 అభ్యర్థుల అభ్యంతరాలను వింటున్నట్టు నటించి, న్యాయం చేస్తున్నట్టు హడావుడి చేసి చివరకు వారిని మోసం చేశారని పేర్కొన్నారు. లోకేష్‌దేమో ఒక మాట, చంద్రబాబుది మరో మాట చెబుతూ నిరుద్యోగులను గందరగోళానికి గురి చేశారని ఆరోపించారు. ఒక వెప్పు వాయిదా వేయిస్తున్నామంటూ చెప్పి మరో వెప్పు తమ చేతుల్లో లేదని చెప్పడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. శనివారం అభ్యర్థుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటున్నట్టు విద్యాశాఖమంత్రి ట్వీట్ చేశారని, మరోవెప్పు తాము వాయిదా వేయాలనే చెప్పామంటూ ముఖ్యమంత్రి పేరుతో సర్క్యులేట్ అవుతున్న ఆడియో రాష్ట్ర ప్రజలంతా విన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే అత్యవసరంగా సమావేశమై గ్రూపు – 2 అభ్యర్థులకు స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ తీరు సరికాదు

భవానీపురం(విజయవాడపశ్చిమ): గ్రూప్–2 పరీక్షలు వాయిదా వేస్తామంటూ అభ్యర్థులను నమ్మించి మోసం చేసిన ఘనత చంద్రబాబు కూటమి ప్రభుత్వానిదేనని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధి పొదిలి చంటిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

28న ఎంబీవీకేలో భూ సమస్యలపై సదస్సు



రాష్ట్ర సదస్సు వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐకేఎంఎస్ ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భూ సమస్యలపై అఖిల భారత రైతు–కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో ఈనెల 28న విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు టి.ప్రకాష్, యు.గనిరాజు తెలిపారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో సదస్సు వాల్ పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే కుట్ర చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే మూడు నల్ల చట్టాలను తెచ్చిందని చెప్పారు. వీటికి వ్యతిరేకంగా ఉద్యమించడంతో వెనక్కు తగ్గిందని, మరలా వాటినే దొడ్డిదారిన తెచ్చేందుకు ప్రయత్నిస్తోందన్నారు. డిజిటల్ అగ్రి మిషన్, నూతన వ్యవసాయక విధానాల పేరుతో ఆదానీ, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు వ్యవసాయ రంగాన్ని కట్టబెట్టడానికి చూస్తోందని చెప్పారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు, పంటల కనీస మద్దతు ధర చట్టం వంటి వాటి ఊసే లేదన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఎనిమిది నెలలు గడిచినా అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు రూ.20 వేల ఆర్థిక సాయం అందలేదన్నారు. మిర్చి ధరలు పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. క్వింటా మిర్చికి రూ.25 వేలు ధర నిర్ణయించి ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు ఎన్.పోతురాజు, రెడ్డి శ్రీను, నాని, అరుణోదయ శ్రీను, ఐఎఫ్‌టీయూ నాయకులు మీరావలి, జి.శంకర్, శ్రీను, పీఓడబ్ల్యూ నగర అధ్యక్షులు ఆసియా బేగం పాల్గొన్నారు.

మానవాళి ఆరోగ్యానికి సూర్యోపాసన సేవ



సూర్య భగవానుడికి పూజలు చేస్తున్న అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): లోక కల్యాణార్థం, సర్వ మానవాళికి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ చేశారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై అర్చకులు సూర్య భగవానుడి చిత్రపటానికి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ నిర్వహించగా, పలువురు ఉభయదాతలు సేవలో పాల్గొన్నారు. మాఘ మాసం విశేష పర్వదినాలతో పాటు ప్రతి ఆదివారం ఆలయంలో సూర్యోపాసన సేవ నిర్వహిస్తున్నామని అర్చకులు పేర్కొన్నారు. సూర్య భగవానుడిని ఆరాధిస్తే సంపూర్ణ ఆరోగ్యం ప్రాప్తితో పాటు భక్తుల ఇంట ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తొలగిపోతాయన్నారు. అనంతరం ఉభయదాతలకు ప్రత్యేక క్యూలో అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

ప్రభుత్వ సర్వేలతో సచివాలయ సిబ్బంది ఇబ్బందులు

సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అర్లయ్య

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ప్రభుత్వ వరుస సర్వేలతో గ్రామ/వార్డ్ సచివాలయాల సిబ్బంది సతమతమవుతూ అనేక ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తోందని సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల అర్లయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో వలంటీర్లకు ఇచ్చినట్టే ప్రభుత్వమే సచివాలయాల ఉద్యోగులకు మొబైల్ ఫోన్లు ఇవ్వాలని, తద్వారా సర్వేలు చేస్తే డేటా భద్రంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఉన్న విధానం ద్వారా ఒకేసారి పలు సర్వేలు చేయాలంటూ ఉద్యోగులపై ఒత్తిడి తీసుకువాడం సరి కాదన్నారు. ఇటీవల కాలంలో డేటా చోరీలు, సైబర్ నేరాలు జరుగుతున్న నేపథ్యంలో ఉద్యోగులపై ఎటువంటి ఒత్తిడి లేకుండా ప్రభుత్వమే ఫోన్, సిమ్ కార్డ్ అందించాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పరిపాలన సంస్కరణల్లో భాగంగా వివిధ సర్వేలకు సచివాలయ ఉద్యోగులను ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. అందుకు వారు వ్యతిరేకం కాకపోయినా ఎటువంటి శిక్షణ తరగతులు నిర్వహించకుండా పై అధికారుల ఆదేశాల మేరకు ఏక కాలంలో అన్ని సర్వేలు పూర్తి చేయాలనడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఉద్యోగుల వ్యక్తిగత ఫోన్లతో ప్రభుత్వ సర్వేలు, యాప్స్ ఇన్‌స్టాలేషన్‌తో వారి వ్యక్తిగత గోప్యతకు భంగం వాటిల్లుతుందని పేర్కొన్నారు.

1వరకు శివరాత్రి ఉత్సవాలు



ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న ఈవో వెంకటరెడ్డి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రముఖ ఆలయమైన శ్రీ విజయేశ్వరస్వామి దేవస్థానంలో మార్చి ఒకటో తేదీ వరకూ శివరాత్రి కల్యాణ మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కె.వెంకటరెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులతో కలిసి ఉత్సవాల ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 23న స్వామి వారిని పెండ్లికుమారుడిగా అలంకరిస్తామన్నారు. ధ్వజారోహణ, అంకురార్పణ తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. 24, 25 తేదీల్లో స్వామి వారికి పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలుంటాయన్నారు. 26న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని తెల్లవారుజాము నుంచి దర్శనాలు, అభిషేకాలు ఉంటాయన్నారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చనలు జరుగుతాయన్నారు.

రేపు ఫెన్సింగ్ జిల్లా జట్ల ఎంపిక

విజయవాడస్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి అండర్–14 బాల, బాలికల ఫెన్సింగ్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే ఉమ్మడి కృష్ణాజిల్లా జట్లను ఈ నెల 25న కంచికచర్ల మండలం పొన్నవరంలోని ఏకత్యా పబ్లిక్ స్కూల్‌లో ఎంపిక చేస్తున్నట్లు కృష్ణాజిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వై.చెంబుబాబు, ఎన్.సతీష్‌బాబు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆధార్, జనన ధ్రువీకరణ, ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్ఏఐ) పత్రంతో మధ్యాహ్నం రెండు గంటల లోపు ఎంపిక ప్రాంగణంలో సంప్రదించాలని, మరిన్నివివరాలకు 95535 28888 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు మార్చి 1, 2 తేదీల్లో కంచికచర్ల మండలం పొన్నవరంలోని ఏకత్యా పాఠశాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

ప్రమాదకరంగా డ్రెయినేజీ సంప్ హౌస్

- కొన్నేళ్లుగా నిరుపయోగం..
- వ్యర్థాలతో నిండింది
- ప్రమాదవశాత్తు పడితే గల్లంతే
- మురుగునీటిపై వేసిన ఐరన్ మెష్ ధ్వంసం



కరకట్ట రోడ్ పక్కన నిరుపయోగంగా ఉన్న డ్రెయినేజ్ సంప్ హౌస్

భవానీపురం(విజయవాడపశ్చిమ): కొన్నేళ్లుగా వీఎంసీ డ్రెయినేజీ సంప్ హౌస్ నిరుపయోగంగా ఉంది. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తమకు సంబంధించిన భవనాలు, ఆస్తులను కాపాడు కోవడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారు. అందుకు భవానీపురం కరకట్ట సౌత్ రోడ్‌లో రీజనల్ సైన్స్ సెంటర్ పక్కన నిర్మించిన డ్రెయినేజీ సంప్ హౌస్ నిదర్శనంగా నిలుస్తోంది. కృష్ణా పుష్కరాల ముందు వరకు కరకట్ట సౌత్ రోడ్‌లో (పున్నమి హోటల్ నుంచి ఎస్ఎంఎస్ ఖుద్దూస్ మున్సిపల్ హైస్కూల్ వరకు) కృష్ణానదీ తీరాన వందలాది చిన్నపాటి నివాసాలు ఉండేవి. ఆ సమయంలో అప్‌కాస్ట్ రీజనల్ సైన్స్ సెంటర్ పక్కనగల స్థలంలో వీఎంసీ డ్రెయినేజ్ సంప్ హౌస్ నిర్మించింది. కృష్ణా పుష్కరాల (2016) సమయంలో రివర్ ఫ్రంట్ అభివృద్ధి పేరుతో నివాసాలన్నింటిని తొలగించి వారికి ప్రత్యామ్నాయంగా జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో ఇళ్లు కేటాయించారు. కోట్లాది రూపాయలు గుమ్మరించి రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేశారు. ఆ తర్వాత అభివృద్ధి చేసిన స్థలాన్ని ప్రజాప్రయోజనాలకు వాడకుండా గాలికి వదిలేశారు.

తొలగించకుండా..

కట్టకింద పేదల ఇళ్లన్నీ తొలగించిన నాటి టీడీపీ ప్రభుత్వం డ్రెయినేజ్ సంప్ హౌస్‌ను మాత్రం తొలగించలేదు. అది ప్రభుత్వానికి సంబంధించింది కావడంతో దాన్ని అలా వదిలేశారు. అప్పటి నుంచి అది ప్రమాదకరంగా తయారైంది. సంప్ ముందు భాగంలో ఉన్న ఖానాలపై ముందు జాగ్రత్తగా వేసిన ఐరన్ మెష్ మొత్తం ధ్వంసమై ఉంది. ఖానాల్లోని డ్రెయినేజ్ వాటర్‌లో ఖాళీ వాటర్ బాటిల్స్ వంటి అనేక వ్యర్థాలతో నిండిపోయింది. సంప్ హౌస్ లోపలకూడా మురుగు నీరు నిలిచి దుర్వాసన కొడుతోంది. సంప్ హౌస్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో యువత క్రికెట్ ఆడుకుంటూ ఉంటారు. ఆటలో భాగంగా బాల్ సంప్ వైపుగానీ లేదా ఖాళీగా ఉన్న సంప్ ఖానాల్లోని మురుగు నీటిలోనైనా పడే అవకాశం ఉంది. పొరపాటున బాల్ నిల్వ ఉన్న మురుగునీటిలో పడితే దానిని తీసుకునే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు దానిలో పడిపోతే గల్లంతేనని స్థానిక పెద్దలు చెబుతున్నారు.



సంప్ భవనం ముందు ఏర్పాటు చేసిన ఐరన్ మెష్ ధ్వంసమైన దృశ్యం



సంప్ హౌస్ భవనం లోపల లోతుగా నిల్వ ఉన్న మురుగు

సంప్ హౌస్‌ను తొలగించాలి

నిరుపయోగంగా, ప్రమాదకరంగా ఉన్న డ్రెయినేజ్ సంప్ హౌస్‌ను వెంటనే తొలగించాలని స్థానికులు సంబంధిత అధికారులను కోరుతున్నారు. సంప్ హౌస్ తలుపులు కూడా తీసే ఉంటున్నాయని, ఆడుకునే యువకులు లోపలకు వెళితే అక్కడ లోతుగా చాలా కాలంగా నిల్వ ఉన్న మురుగునీటిలో పడిపోయే ప్రమాదం ఉంది. వీఎంసీలో సంప్‌ల నిర్వహణ చూసే అధికారులుగానీ, సూపర్‌వైజర్లుగానీ ఇప్పటికైనా నిరుపయోగంగా ఉన్న డ్రెయినేజ్ సంప్ హౌస్‌ను పట్టించుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ఏపీటీడీసీ బస్



భవానీపురం(విజయవాడపశ్చిమ): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) రాజమండ్రి నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి 18 సీట్ల ఏసీ మినీ బస్‌ను ఏర్పాటు చేసింది. ఈ నెల 25వ తేదీ సాయంత్రం 6 గంటలకు రాజమహేంద్రవరం నుంచి బయలుదేరి రాత్రి 9 గంటలకు విజయవాడ భవానీపురంలోని హరిత బెరంపార్క్ వద్ద ఆగుతుంది. తిరిగి 10 గంటలకు బయలుదేరి 26వ తేదీ ఉదయం శ్రీశైలం పుణ్యక్షేత్రానికి చేరుకుంటుంది. అక్కడ ఏపీటీడీసీ హోటల్ వద్ద ఆపుతారు. తర్వాత టిఫిన్, భోజన సదుపాయం ఏర్పాటు చేసింది. అనంతరం శ్రీశైలంలో మల్లన్న స్వామి దర్శనం అయిన తరువాత బస్ బయలుదేరి త్రిపురాంతకం మీదుగా 27వ తేదీ తెల్లవారు జామున 2 గంటలకు విజయవాడ, సాయంత్రం 5 గంటలకు రాజమహేంద్రవరం చేరుకుంటుంది. ఈ ప్రత్యేక టూర్ ప్రోగ్రామ్‌కు పెద్దలకు రూ.4,360, పిల్లలకు రూ.3,490 టికెట్ ధరగా నిర్ణయించినట్లు ఏపీటీడీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శేషగిరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాల కోసం 9848629341 (ఐఆర్ఓ, రాజమండ్రి), 9848007025 (సీఆర్ఓ, విజయవాడ) మొబైల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.